★ ఆత్మకథ ★

రచన
శ్రీమతి నాయని స్వప్నకుమారి

అది డ్రాయింగు రూమ్ అందులో ఒక బల్ల. దాని పైన మల్లెపువ్వులాంటి తెల్లని గుడ్డ దానిమీద ఫ్లవర్ వాజ్ కొన్ని పత్రికలు ఉన్నవి అక్కడ ఒక కుర్చీమీద సుధాకరరావు కూర్చుని తీక్షణంగా ఒక కవరు చూస్తున్నాడు మధ్య మధ్య అక్క రాలేదేమా అని వీధివంక చూస్తున్నాడు అంతలో 12 గంటలు కొట్టింది గడియారం

"ఏం సుధా! కాలేజీ లేదా ఈ రోజు?" అంటూ ప్రవేశించింది శశి. ఆవిడ సన్నగా పొడుగ్గా ఉండే రూపం తీర్చిదిద్దిన ముఖం సౌందర్యవతి కాకపోయినా కురూపి మాత్రం కాదు సన్నటి వాయిల్ చీర కట్టి తల వెంట్రుకలను జారుముడి వేసి చేతిలో "స్టెతస్కోపు" ఆమె డాక్టరని చెప్తున్నది అప్పుడే పని పూర్తి చేసుకుని వైద్యశాలనుండి తిరిగి వచ్చింది శశి

సుధాకరుడు అక్క ప్రశ్నకు లేదన్నట్లుగా తల త్రిప్పి, మళ్ళీ కవరు ముఖం చూచి "ఎవరక్కా ఈ రామారావు?" అనడిగాడు

"ఏమిటీ! ఎక్కడ్నుంచి వచ్చింది" అని ఆతురత చూపించింది శశి

"విశాఖపట్నంనుండి, శుభలేఖ రామారావు గారమ్మాయి పెళ్ళట, ఎవరక్కయ్యా?" అని కుతూహలంగా అడిగాడు.

"ఏది ఆ శుభలేఖివ్వు" అంటూ అందుకుని తృప్తిగా అటు ఇటు త్రిప్పి మార్చి మార్చి చూసింది ఆమె కళ్లు రెండూ సంతోషమూ భక్తి భావమూ నిండి మెరిసినవి

తమ్ముడు ఇంతసేపూ ఆవిడవైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు శశి కథ మొదలు పెట్టింది

"ఆయన ఒక మహానుభావుడు నేను యింత వృద్ధిలోకి రావడానికి కారణం ఆయన తాతగారి ఆస్తి అంటూ ఉండి కూడా అమ్మ దిక్కులేందయిపోయింది అటూ యిటూ లేని నిర్భాగ్యులమయిన మనల్ని చేరతీశారు. అతను నాన్న గారి ప్రాణమిత్రుడు ఆయన ఋణం యెట్లాతీర్చుకోవాలో అర్థం కావడం లేదు ఆయన గురించి నాన్న గార్ని గురించి అమ్మ చెప్తూఉండేది పాపం. అంటూ చెప్పేది ముగించకుండానే, గడియారంవంక చూచి "లే తమ్ముడూ ఒంటిగంట అవుతోంది భోంచెయ్యాలి" అని అన్నది

"ఆ చెప్పేదేదో పూర్తి చెయ్యిమరి"

"ఇప్పుడేకావాలా? అంతా మొండిపట్టు సాయంత్రం నాకు పనిలేదు లే భోంచేసి తీరిగ్గా కూర్చుని చెప్పుకుందాం" అని లేచింది శశి

ఇద్దరిభోజనాలు పూర్తయినవి తిరిగివచ్చి డ్రాయింగ్ రూములో కూర్చున్నారు సుధాకర్ ఒక్క క్షణమైనా వ్యర్థం చెయ్యకూడదన్నట్లుగా అక్క మొఖంచూచి "అమ్మనెందుకు తాతావాళ్ళు నిర్లక్ష్యంగా చూచారు? నాన్ననెందుకు గౌరవించలేదు? మనకు రామారావు గారు సహాయం చెయ్యవలసిన అవసరం యేమిటి?" అని ప్రశ్నించాడు

తమ్ముడూ! నాకు 12 సంవత్సరాలప్పుడు, నేను స్కూల్లో రెండవఫారం చదువుతున్నాను నీకు మూడు సంవత్సరాలు అమ్మ, నాన్న, రామారావు గారింట్లో ఒక భాగంలో ఉండేవారు నాన్న ప్రొద్దున్నేపోయి మధ్యాన్నం ఒంటిగంటకు వచ్చేవారు చాలాకోపం చిరాకుగా ఉండేవారు నాకింకా అభం శుభం తెలియదు నాన్న వస్తున్నారని తెలిస్తే చాలు అమ్మ నన్ను అక్కడ ఉండనిచ్చేది కాదు ప్రక్క యింటికి పంపేది

అమ్మ చాలానీరసంగా ఉండేది నాన్నకూడా చాలా నీరసంగా యెప్పుడూ దగ్గుతూ ఉండేవారు క్రమక్రమంగా నాకు ఊహ తెలుస్తున్నది నేను నాల్గవ ఫారం చదువుతున్నాను

ఒకరోజు నేను స్కూలు నుంచివచ్చి అమ్మదగ్గర నా జీతం కట్టకపోతే పేరుకొట్టేస్తారని మారాం పెట్టున్నా

ఇంతలో నాన్నవచ్చి "నేను సంపాయించలేక చస్తుంటే, ఈ పిల్లకు జీతమా! నాప్రాణం తీస్తున్నది నేనుచస్తేగాని పీడ వదల" దని చాలాచాలా కేకలేశారు ఆసమయంలో నాన్నముఖం చూడలేకపోయాను ఆ తరువాత రామారావుగారిదంతా కనిపెట్టి నాకు నెలనెల జీతం కట్టేభాధ్యత తనదని అమ్మతో చెప్పారు. అమాటలువిని అమ్మ కండ్లవెంట నీళ్ళు పెట్టుకుంది.

అరాత్రి నాకు సరిగ్గా 12 గం॥ లకు మెలకువ వచ్చింది ఎవరివోమాటలు వినిపిస్తున్నవి ఇంకెవరివి? అమ్మా, నాన్నా మాట్లాడుకుంటున్నారు.

"పిల్లలిద్దరూ నిద్రపోయారా?" అని నాన్నగారిప్రశ్న

"ఆ నిద్రపోయారు. ప్రొద్దుట ఊరికే దానిఎదురుగుండా మాటలన్నారు అది చాలాసేపు ఏడ్చింది దానిజీతం మీస్నేహితుడు రామరావుగారు కట్టారు" అని జాలిగా సమాధానమిచ్చింది

"ఆ! రామరావుగారు కట్టానన్నారా! అతనికి మనం చాలా ఋణపడి వున్నాం సరూ! అతను నాకెన్నిసార్లో ఆదుకున్నాడు ఛీ! పాడుబ్రతుకు భార్యా బిడ్డలకు కడుపునిండా కూడు, కట్టగుడ్డ యివ్వలేని దౌర్భాగ్యుణ్ణికదూ! ఛీ ఇటువంటి బ్రతుకు బ్రతికేకంటే చావడంమేలు" అని దగ్గుతెరవచ్చి తట్టుకోలేక పోయారు

"చాలా ఉద్రేకంగా మాట్లాడుతున్నారు. మీఆరోగ్యమన్నా చూచుకోరు రోజులన్నీ ఒకేమోస్తరుగా ఉంటాయా? ముందుకు మంచిరోజులున్నాయి మనకు మీరు ఆవేశంగా మాట్లాడుతూ మీఆరోగ్యానికి భంగంకలుగ చేసుకోకండి" అనిప్రాధేయ పడ్డది అమ్మ

"పిచ్చిదానా! ఇంకా నీకీపాడులోకంలో బ్రతకాలని ఉన్నదా? ఈలోకంలో డబ్బున్నవాళ్ళదే రాజ్యం పొట్టపొడిచినా అక్షరంలేని మూర్ఖుడుకూడా డబ్బుతో చాలా గౌరవం పొందుతున్నాడు ఎవరైనా డబ్బునిచూచి మానవుని గౌరవిస్తున్నారు కాని చదువుకుని ఉన్నతభావాలు కల్గిఉన్న యువకుణ్ణిగానీ యువతినిగాని కాదు ఇటువంటి లోకంలో తుచ్ఛులు బ్రతకాలికాని మనబోటి మానాభిమానాలుకల్గినవారు బ్రతకడానికి తావులేదు సరూ!

కాస్సేపు తమాయించుకుని నాన్నమళ్ళీ అన్నారు.

"నాకు ఈప్రపంచంలో నీవు ఒక్కదానివి కనుపిస్తున్నావుసుమా! తండ్రి గొప్పభాగ్యవంతుని కిస్తానంటే ఈనిర్భాగ్యుణ్ని పెండ్లాడావు నీకు కడుపునిండా కూడూ కట్టబట్ట ఇవ్వలేక పోయినప్పటికీ ఇంకా ఈ నిర్భాగ్యుణ్ని పట్టుకుని ఊగులాడు తున్నావు నీవెంత సుగుణ శీలవో కదా!", అమ్మ ఆయన్ని మధ్యలోనే ఆపి "పాతగాథలన్నీ త్రవ్వుకుంటున్నారు పిల్లలు లేస్తారు తెలుసా! ఆరోగ్యం సరిగా లేదుకదా నిద్రపోకూడదూ! మీకు విశ్రాంతి అవసరం" అంటూ మరిపించాలని చూసింది

అంతవరకూ చెవులు రిక్కపెట్టుకుని వింటూనే ఉన్నాను నిజంగా తమ్ముడూ! నా జీవితంలో నేనప్పటి వరకు అమ్మ కొట్టినా నాన్న కోప్పడినా మాట్లాడకుండా ఊరుకునేదాన్ని కాని ఆరోజు రాత్రి మనస్సేమీ బాగుండలా అట్లా ఆలోచిస్తున్నా యెప్పుడు నిద్రపట్టిందో తెలియదుకాని తెల్లగా తెల్లవారిన తరువాత "బడికి వెళ్ళాలి లేవే" అంటూ అమ్మ లేపింది

మామూలుగా కాలకృత్యాలు తీర్చుకుని బడికి వెళ్ళాగాని యేమీ తోచలా! మనస్సంతా యెవరో కెలుకుతున్నట్లున్నది ఇంటికి తిరిగొచ్చాక అమ్మతోమాట్లాడకుండా 5 సంవత్సరాల నిన్ను ఆడించమన్నా అమ్మ మాట వినకుండా గదిలో తలుపులు వేసుకుని ఆలోచిస్తున్నా!

"అమ్మానాన్నా ఇటువంటిస్థితిలోనికి రావడానికి కారణం? అమ్మ అంటే తాతయ్యకెందుకు యిష్టంలేదు? అమ్మ భాగ్యవంతుని చేసుకోకుండా నాన్ననెందుకు చేసుకోవాలి?" అన్న ఆలోచనలు నామనస్సులో యుద్ధం చేసినయ్.

ఇంతలో అమ్మవచ్చి "పిలిస్తే పలకవేమే! చీకటికొట్లోకూర్చున్నావేమే" అని ముఖమెత్తి చూచింది. నా కండ్లు యెఱ్ఱపడి ఉన్నవి.

"అదేమిటమ్మా అట్లా ఉన్నావు! ఎవరయినా యేమయినా అన్నారా? స్కూల్లో పిల్లలతో పోట్లాడావా? లేక నీకేమైనా కావాలా?"

"అమ్మా నేనొకటి అడుగుతా చెప్తావా!" అన్నాను.

'ఏమిటమ్మా" అని అడిగింది.

"అమ్మా ! రాత్రిజరిగిన మీసంభాషణ విన్నాను. నాన్న గారేమిటో తాతాగారు నిన్నుభాగ్య వంతుడికివ్వాలని చూస్తే నీవు అది నిరాకరించి నాన్నను చేసుకున్నావని, తాతగారు నీ సంబంధమే లేకుండా వదులుకున్నారని మాట్లాడుతున్నారు - అమ్మా ! యెవరైనా కన్నబిడ్డలు తప్పులు చేస్తే కన్నతల్లీ దండ్రీ వాళ్ళను వదిలివేస్తారా? నిజంగానా అమ్మా !" అని ప్రాధేయ పడ్డాను

"చిన్నదానివి నీకెందుకు లేమ్మా ఈ అజులన్నీ" అని మందలించ బోయింది.

"లేదమ్మా, నాకు చెప్పితీరాలి లేకపోతే నీతో మాట్లాడను అన్నం తినను" అని మూతిబిగించి కూర్చున్నాను

"అంతపట్టుదల యెందుకమ్మా ! మరిచెప్తావిను. నా దుఃఖభాజనమైన జీవితగాథ" అని మొదలు పెట్టింది

"మీ తాతగారు సుందరరావుగారు చాలా పేరు పొందిన డాక్టరు. ఆయన రాజమండ్రీలో "ప్రాక్టీసు" పెట్టారు. భార్య పేరు సుశీల నిజంగా సుశీలే ఆదంపతులకు నేను ముద్దుబిడ్డను, చాలా గారాబంగా పెరిగాను మానాన్న చాలా డబ్బు సంపాదించాడు.

నాకు 10 సంవత్సరాలు నేనుస్కూల్లో చదువుతున్నాను మాఅమ్మకు చాలాజబ్బు చేసింది నాన్న తను మందులివ్వడమే కాకుండా గొప్పగొప్ప డాక్టర్ల చేత మందు లిప్పించారు కాని అవి ఫలించలేదు

గడ్డురోజులు కాబోలు భగవంతుడు నాజీవితమంతా ఈవిధంగా వ్రాశాడు గనుకనే అమ్మ నన్ను నాన్న చేతుల్లో వదిలి ప్రాణాలు విడిచింది.

అమ్మ చనిపోయిన తరువాత నాన్నే నన్ను పంచ ప్రాణాలుగా చూచేవారు ఎంత ప్రేమగా చూచినా అమ్మచూచి నట్లు ఉండేది కాదు అమ్మలేదన్న దిగులుతో నాన్న "ప్రాక్టీసు" చూచుకోకుండా ఉండేవారు అప్పుడు మాతాతగారు వాళ్ళంతా కలసి మానాన్నకు మళ్ళీ పెండ్లిచేశారు.

మాపిన్ని వచ్చింది చాలా నాజూగ్గాఉండేది నాన్నకసలు రెండవపెండ్లి అంటేనే అయిష్టంగా ఉండేది బలవంతాన చేశారు అందుచేత ఆమెతో యెక్కువ మాట్లాడే వారుకాదు ఏపనికావాలన్నా నాతో చెప్పి చేయించుకునేవారు. వెళితే వైద్యశాల. లేకపోతే నాగదిలో గడిపేవారు.

ఏస్త్రీ తనభర్త సరిగా మాట్లాడకుండాఉంటే సహిస్తుంది! దీనికంతా నేనే కారణమని ఆమె ఊహ ఈ ఊహాలే నాకష్టాలకు పునాదులు. మొట్టమొదట్లో యెంత ప్రేమగా ఉండేదో ఆ ప్రేమంతా ద్వేషంగా మారిపోయింది

నాకు క్రమక్రమంగా యుక్తవయస్సు వచ్చింది స్త్రీ శక్తిస్వరూపిణి కదా ! శక్తి తలుచుకుంటే కొనసాగనిదేది? క్రమ క్రమంగా నాన్నను కూడా లోపరుచుకున్నది అన్నాళ్ళు నాకు అండగా ఉన్న నాన్నకూడా ఆమెవల్లో పడి నాకు విముఖతగా కనపడేవారు ఇంట్లో మెలగడానికే భయంగా ఉండేది

ఇంక మీనాన్నతో పరిచయం వినమ్మా ! మ్మాయింటికి యెదురుగుండా ఒకయింట్లో ఒకరూములో మీనాన్నగారు, రామారావుగారూ చదువుకుంటూ ఉండేవారు. నేనప్పుడు 5 వ ఫారం చదువుతుండేదాన్ని రోజూ బడికి పోవడానికి బయలుదేరినప్పుడల్లా నాముఖంచూస్తూ ఉండేవారు.

నేనంత పట్టుదలగా పట్టించుకో లేదు. ఆసంవత్సరమంతా అట్లాగే గడచింది నేను స్కూలుఫైనల్ చదువుతున్నాను

ఆరోజు ఆదివారం స్కూలు లేదు ఇంట్లో కూర్చుని చదువుకుంటున్నాను ఇంతలో ఒక కుఱ్ఱవాడొచ్చి ఒక ఉత్తరం పడేస్తూ "అమ్మాయిగారు, ఆ అబ్బాయిగారిమ్మన్నా"రని యెదురింటిని చూపిస్తూ అన్నాడు. నాకు చాలా భయమేసింది పిన్నియెక్కడ చూస్తుందో అని చప్పున ఉత్తరం తీసి పుస్తకంలో పెట్టేశాను. తర్వాత తీరిగ్గా ఎవరూలేనప్పుడు దాన్ని విప్పాను.

అదంతా "ప్రేమలేఖ" పూర్తిగా దాన్ని చదవడానికే భయంవేసి చదవకుండానే చించిపారేశాను అట్లా చాలా ఉత్తరాలు వచ్చాయి. నేను స్కూలుఫైనలు చదువుతుండ

గానే మా నాన్నగారు నాకు వివాహప్రయత్నాలు చేయడం మొదలుపెట్టారు చాలా గొప్ప గొప్ప సంబంధాలు వచ్చాయి అవన్నీ పిన్ని పడగొట్టింది. నాకింకా వివాహం చేసుకుందామన్న ధ్యాసలేనందున నేనావిషయాలంత పట్టించుకోలేదు మాపిన్ని నావివాహంలో ఎందుకంత అయిష్టత చూపుతుందో కూడా నేనాలోచించ లేదు

ఒకరోజున నేను స్కూలునుండి వచ్చేసరికి మళ్ళీ ఉత్తరం వచ్చింది "ప్రేమలేఖ" ని తెలిసి కూడా చూడాలని బుద్ధిపుట్టి విప్పిచూచాను అందులో ఉన్నది ఇది వినమ్మ'

చి సరోజకు,

ఆశీర్వదించి నీకుచాలా ఉత్తరాలు నాస్నేహితుడు "మాధవరావు" వ్రాశాడు. ఒక్కదానికి కూడా నీవు జవాబు వ్రాయలేదు నిన్ను చూచిన దగ్గరనుండి నాస్నేహితుడు నిన్ను వివాహం చేసుకోవాలని ఉత్సాహ పడుతున్నాడు ఆవిషయమే నీకు ఉత్తరాలద్వారా తెలియ పరచాడు అంగీకరించినది లేనిదికూడా మాకు మళ్ళీ తెలియ పరచలేదు నా స్నేహితుడు నీ వియోగాగ్నిచే తపించిపోతున్నాడు అన్నం తినడు చదువుచూచుకోడు నిన్ను స్మరిస్తూ కాలం గడుపుతున్నాడు నీ తండ్రిని అడగాలని నాతలంపు కాని మీ పిన్నమ్మ అడ్డం వస్తుందని నా అనుమానం కాబట్టి అతనిని రక్షించే భారం నీది నీవు ఆలోచించి తిరిగి సమాధానమిచ్చినా సరే లేక నన్ను కలుసుకుని మాట్లాడినాసరే నీశ్రేయోభిలాషి

"రామారావు"

అనిఉన్న ఉత్తరంచూచి సమాధాన మేమిద్దామా అని ఆలోచిస్తున్నాను ఆ రాత్రంతా నిద్రపట్టక ఉత్తరంగురించి ఆలోచిస్తున్నాను ఇంతలో ప్రక్కగదిలో నుండి మాటలు వినిపిస్తున్నవి నా గది ప్రక్కదే మా నాన్నగారి గది ఆ సంభాషణ చాలా తీవ్రంగా జరుగుతున్నది పిన్ని, నాన్న మాట్లాడు కుంటున్నారు. ఆ మాటలేదంతా నావిషయమేనని తెలిసి చెవులు నిక్కించుకుని వింటున్నాను

"ఎంతకాలం చదివిస్తారు అమ్మాయిని?" పిన్నిప్రశ్న

"అది చదువుకునేవరకు" నాన్నగారి సమధాం

"దానికి పెండ్లిచేయరా ! పెద్దదవుతుంటే చూస్తు ఊరుకుంటే అప్రతిష్ట కదా!" అనియెంతో అనురాగంగా అడిగింది పిన్ని

"వచ్చిన సంబంధాలన్నీ పడగొట్టావు మళ్ళీ ప్రశ్నిస్తావేమి నీవు బ్రతికుండగా సరోజినికి వివాహమయ్యే యోగంలేదు" కర్కశంగా నాన్నగారి మాటలు వినిపించినయ్

"నేనేమి చేశానండీ నన్నంటారు మీ అమ్మాయి శ్రేయస్సుకోరేగా వాటిని కాదన్నది" అన్నది కోపంగా

"శ్రేయస్సు కోరేదానివి కాబట్టే వచ్చిన సంబంధాలు పోగొట్టేవు వచ్చే సంబంధాలు రాకుండా చేశావు నీ కన్నబిడ్డయితే ఇటువంట పనులు చేసే దానివా? సుశీలే ఉంటే దానికీపాటికి వివాహమై మంచిస్థితిలో ఉండేది నీవు తల్లివా? సవతితల్లి తల్లి అవుతుందా? ఇదంతా నాకర్మ నిజంగా నీకుదానిపైన అనురాగం ఉంటే మంచి సంబంధము వచ్చేటట్లు చూడు లేదా వచ్చేవాటని పడగొట్ట కుండా చూస్తూఊరుకో" అని విసురుగా సమాధాన మిచ్చారు

"అమ్మాయికి మంచిసంబంధం చేయాలనేగా వచ్చేవన్నీ పడగొట్టింది 'అవును లెండి సవతితల్లి అనేఅంటారు గాని కన్నతల్లి అనిఅంటారా?" అంటూ వెక్కివెక్కి యేడవడం మొదలు పెట్టింది

"మంచి సంబంధం అనిఅంటావే, ఎక్కడున్నపని వచ్చిపడడానికి మీ ఊరుదగ్గరేమన్నా ఉంటే చూడరాదు?"

"నే చెప్పిన సంబంధం చేస్తారా?" అని మా పిన్ని కుతూహలంగా ప్రశ్నించింది.

"ఆమాటమీదనే నిలబడాలి తరువాత కాదంటే లాభం లేదు"

"సరే ! దానియిష్టంవద్దా? దాని కిష్టంలేని పని నేను చెయ్యలేను" గాభరాగా నాన్నగారి మాటలు వినిపించాయి

"ఇంకా అమ్మాయి ఇష్టాయిష్టాలతో పనేమిటండి మనం అమ్మాయి బాగోగులు చూడకుండా చేస్తామా ! మీరు "ఊ" అనండి రేపు రప్పిస్తాను" అన్నది పిన్ని

"ఎవరా అబ్బాయి? ఏమిచదువు కున్నాడు? ఆస్థి పాస్తు

ఉన్నవా? అందగాడేనా" అని నాన్నగారి ప్రశ్నలు వర్షంలా కురిసినయ్

"అదేమిటండీ అట్లా అడుగుతారు. మా చిన్నాయన కొడుకు ఆస్థి బాగా ఉన్నది రేపు మీరే చూస్తారుగా వాడి అందం" పిన్ని నవ్వుతూ అన్న మాటలు వినిపించినయ్.

"అట్లాగే" నాన్న నిరుత్సాహంగా పలికిన మాటలు వినిపించినయ్— ఇక ఆ రాత్రంతా కంటిమీద కునుకు లేదు

తెల్లవారి మామూలుగా లేచి కాలకృత్యాలు తీర్చుకుని స్కూలుకు పోయాను స్కూల్లో అంతా ఇదే ఆలోచన ఆ ఉత్తరానికి సమాధానమేమని వ్రాసేది? నా సౌఖ్యాన్ని చూచేదా? నాకోసం తపించే "మాధవరావు" ప్రాణాలను రక్షించేదా! నా తల్లీ దండ్రీ ఆజ్ఞలకు బద్ధురాలనై ఉండేదా! ఆఖరికి ఇంటికి వెళ్ళి మళ్ళీ ఆలోచించి సమాధానం వ్రాయాలని తీర్మానించుకున్నాను

నేను ఇంట్లో అడుగుపెట్టగానే ఎన్నడూ రాని పిన్ని యెదురుగుండా వచ్చి నా చేతుల్లో పుస్తకాలు అందుకున్నది. చాలా ఉత్సాహంగా స్నానం చేసి బట్టలు మార్చి చక్కగా ముస్తాబవమ్మా పెండ్లివారు వస్తారని చెప్పింది ఇంతహడావుడికి కారణం ఇదా! అని అనుకుంటూ, ఇంక ఆమె ఆజ్ఞనుమీరి ఆమె ఉత్సాహాన్ని పాడుచెయ్యడమెందుకని పిన్ని చెప్పినవన్నీ చేయబోయాను నేను స్నానం చేసి ముస్తాబయ్యేసరికి నాగదిలో కాఫీ ఫలహారం తయారుగా ఉన్నాయ్

ఇంతలో పెండ్లికొడుకు వాళ్ళ బంధువులు దిగారు మా పిన్ని చాలా ఆనందంగా తిరిగింది పెండ్లికొడుకుని చూపించారు అబ్బా! నేనేమిచెప్పేదమ్మా! అతడు అందగాడు కాకపోలేదు అందరూ అనుకున్నట్లు నాకు ఈడూజోడూ సరిపోయేటట్లే ఉన్నాడేమో! కాని, అతని ముఖంలో కొట్టవచ్చే ఏదో కర్కశత్వం నా హృదయాన్ని కలచివేసింది అతడంటే నాకిష్టం కలుగనీయకుండా చేసింది దానికితోడు ఎదురింటి మీనాన్నగారావరకే నాస్మృతిలో కిరం వేసుకుని కూర్చున్నారు ఈ సంఘర్షణమధ్య నా మనస్సు చాలా బాధపడ్డది—

తర్వాత నాన్నగారు అడిగారు "అతను నచ్చాడా"అని

"నాకిష్టం లేదు నాన్న" ఆవేశంతో చెప్పాను

"నీకిష్టమేమిటి! ఇంతకంటే మంచివాడు దొరుకుతాడా? ఆస్థిపాస్తులున్నాయ్ దగ్గర సంబంధం ఈడూ జోడూ!" అని మా పిన్ని ఉపన్యాసాలు మొదలుపెట్టింది—నిజమే మరి! కాని నా మనస్సుకు సమాధానం ఆవిడ మాటలేం చెప్పకలవు?—

"నాకు నచ్చలేదు నాన్న!" ఒక్కగాని ఒక్క బిడ్డనే? చూస్తూ చూస్తూ తడిగుడ్డతో గొంతుకోస్తారా? వెక్కి వెక్కి ఏడుస్తూ ప్రాధేయపడ్డాను—కాని కారణాలు చూపించలేని నా నిరసనకు మా నాన్నగారు సుముఖులు కాలేదు. నాకు ప్రపంచమంతా తిరుగుతున్నట్లు కనపడింది గబగబ లేచి నాగదిలో కెట్లా వచ్చానో నాకే తెలియదు నా తల్లిదండ్రులు మాట్లాడుకునే మాటలు కూడా వినపడలేదు—

నా గదిలోకొచ్చి కుర్చీలో కూలబడి ఏడవడానికిగూడా శక్తిలేక నాలో నేనే కుమిలిపోతున్నాను నాకెదురుగుండా మాతృమూర్తి సుశీల జాలిగా "నిన్ను రక్షించడానికి నాకు శక్తి లేదమ్మా!" అన్నట్లు చూస్తున్నది గోడమీద ఫొటో

ఇంతలో గాలికి కిటికీరెక్కలు తెరుచుకున్నవి ఎదురుగుండా, మీ నాన్నగారిగది కనపడ్డది అది చూడగానే ఉత్తరం జ్ఞాపకం వచ్చింది వెంటనే ఉత్తరం చూచి నిశ్చయించుకున్నాను అతను బీదవాడైనా సరే అతని కోసం ఈ తుచ్ఛభోగభాగ్యాలన్నీ వదులుకుని అతన్ని చేపట్టి అతని ప్రాణాలను రక్షించాలి అప్పటికప్పుడు రామారావుగారి, పేర ఇంట్లో పరిస్థితులన్నీ వివరిస్తూ, "మీ స్నేహితుడైన మాధవరావుగారిని వివాహం చేసుకోడానికి అంగీకరించా"నంటూ ఉత్తరం వ్రాశాను.

(సశేషం)

★ ఆత్మకథ ★

రచన :

శ్రీమతి నాయని స్వప్నకుమారి

వెనుకటిగాథ :—శశి కాలేజీ నుండి వచ్చేసరికి ఆమె సోదరుడు, సుధాకర్ ఆమె చేతికి శుభలేఖ నొకటి అందిస్తూ, "రామారావుగా రమ్మాయి పెళ్ళట, ఎవరక్కయ్యా?" అని కుతూహలంగా అడిగేడు శశి. ఆ కవరు విప్పి చూచి సంతోషంతో తమ్ముడికి కథంతా చెప్పడం మొదలుపెట్టింది.

"నాన్నకి ఉద్యోగం లేక చాలా బాధపడుతూవుంటే రామారావుగారు మమ్మల్ని ఆదరించి వారింట్లో పెట్టుకున్నారు. నాన్నకి 60 రూ॥ ఉద్యోగం యిప్పించేరు. ఆయన ఎప్పుడూ దిగులుగా వుండేవారు. జీవితంపైనే ఆశ వుండేదికాదాయనికి. వీరి పరిస్థితిని చూస్తే నాన్న, అమ్మ యింత బీదస్థితిలోకి రావడానికి కారణం తెలిసేదికాదు నాకు. ఒకనాడమ్మనడగ్గా ఈవిధంగా చెప్పింది అమ్మ."

"నా చిన్నతనాన్నే తల్లి చనిపోయింది. మా నాన్న నన్నెంతో గారాబంగా చూచేవారు. అమ్మ చనిపోయిందన్న బెంగతో నాన్న దిగులుగా వుండేవారు. తాతగారి బలవంతంపై నాన్నకు మరో వివాహం చేసేరు. మారుటి తల్లి బాధలతో నా ప్రాణం విసిగేది. అప్పుడు రామారావుగారు మా యింటి కెదురుగా వుండేవారు. ఆయన నా బాధలన్నీ చూచి వారింట్లో ఉన్న మాధవరావుగార్కి నన్నిచ్చి వివాహం చేయాలన్న వుద్దేశ్యంతో మాధవరావుగారిచే నాకు పుత్తరాలు వ్రాయించేవారు. ఈలా వుండగా ఒక రోజు నాన్నగారు ఒక సంబంధాన్ని నిశ్చయించి వార్ని వివాహమాడుటకు నిర్భందించేరు. కాని నా కిష్టంలేదని స్పష్టపరచి, లోగడ మాధవరావుగారు వ్రాసిన వుత్తరాలు జ్ఞప్తికి తెచ్చుకొని ఎలాగైనా, ఎంత బీదవాడైనా ఆయన్నే వివాహమాడాలని నిశ్చయించుకొని, నా నిశ్చయాన్ని వుత్తరం ద్వారా రామారావుగారికి తెలియజేశాను." ఇదీ జరిగినకథ. ఇక చదవండి.

ఆ భయంకర రాత్రి నన్ను భయపెడుతూనే అంతమొంది తెల్లవారింది. పక్షుల కల కలా రావాలు అప్పుడప్పుడే ఉదయించడానికి సిద్ధమైన సూర్య భగవానుని ఎఱ్ఱని కాంతిలో ఉండి శోభ చాలా అందంగా ఉన్నయ్. ఉత్తరం యెట్లా పంపించాలా అని ఆలోచిస్తున్నాను.

నాన్నగారొచ్చి బుజంమీద చేయివేస్తూ "ఇష్టపడమ్మా!" అంటున్నారు. నేను తల ప్రక్కకు త్రిప్పి మాట్లాడకుండా ఊరుకొన్నాను.

ఇంతలో "ఆదేమే మొద్దులాగ సమాధానం చెప్పవేం?" అంటూ ప్రవేశించింది నాయకురాలు మా పినతల్లి.

"నాఅభిప్రాయం నిన్ననే చెప్పానుగా!" ముక్తసరిగా సమాధానమిచ్చాను. "ఆ! అభిప్రాయం ఇంకా మార్చుకో లేదా?" కర్కశంగా నాన్నగారు ప్రశ్నించారు.

"లేదు!" నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాను.

"నీ భవిష్యత్తును గురించి ఆలోచించావా!" కోపంగా అన్నారు.

"అన్నీ ఆలోచించే సమాధానం చెప్తున్నాను. నా కంఠంలో ప్రాణముండగా మీరిద్దరే కాదు ఈ లోకమంతా యేకమైనా నన్ను ఆ దౌర్భాగ్యుడి కిచ్చి చెయ్యలేరు. నేను చచ్చిన తరువాత నా శవానికి, అతణ్ణి కట్టాల్సిందే. ఇది మాత్రం నిజం. బాగా ఆలోచించి మాట్లాడుతున్నాను. నేను బాగా ఉండాలంటే ఈ సంబంధాన్ని వప్పుకోకండి. ఇప్పటికింకా మించిపోలేదు నాన్నా! మీరు పెద్ద చదువు చదివారు. పిన్ని చదువు లేనిది. ఆమెకు నచ్చచెప్పి వప్పించే శక్తి మీకున్నది......" నా మాటలు పూర్తి కాకుండానే నాన్న చాలా కోపంగా "వ్యర్ధ ప్రసంగం చాలించు. పిన్ని చెప్పినట్లు అతన్ని పెండ్లి చేసుకుంటే సరే, లేకపోతే నిన్ను ఇంటినుండి కదలనీయను. చావడానికి కూడ వీలు లేకుండా చేస్తాను. ఈ రోజునుండి బడి మానేసెయ్" రూక్షంగా అని వెళ్ళిపోయారు.

ఇవన్నీ నాబుఱ్ఱ కెక్కలేదు. నా ఆలోచనంతా ఉత్తరం చేరవెయ్యడ మెట్లాగా అని.

గడియారం 8-30 గం॥ లు కొట్టింది. తలుపు తెరచు

కుని బైటికి వచ్చాను. నాన్న లేరు, బహుశా 'డిస్‌పెన్సరీ'కి వెళ్ళి ఉంటారు. పిన్ని లోపల వున్నది. బయట తలుపు తీసి చూచాను. మాధవరావుగారి రూమువద్ద ఎవరో కుఱ్ఱవాడున్నాడు. ఆ అబ్బాయిని పిలిచాను. తీరా చూస్తే నాకింతకుముందు ఉత్తరాలందిచ్చిన కుఱ్ఱవాడే. నన్ను చూడగానే పరిగెత్తుకుంటూ వచ్చాడు. నా చేతి కవరు ఆ అబ్బాయికిచ్చి, "రామారావుగారి" కిచ్చి తిరిగి సమాధానం తెమ్మన్నాను. వాడు పరుగెత్తాడు.

ఆ ఇంట్లోనే "వెంకయ్య" అనే నౌకరున్నాడు. చాలా మంచివాడు. అమ్మ పోయిన దగ్గరనుండి నన్ను ఒక కంట కాపాడుతూ వచ్చాడు. ఇంట్లో జరిగే దంతా వాడు చూస్తుండే వాడు. ఆ రోజు సాయంత్రం రామారావు గారి దగ్గరనుండి నాకు సమాధానమొచ్చింది. అందులో "నేనంగీకరించినందుకు చాలా సంతోషించారని, ఆ యమ బంధాలనుండి నన్ను రక్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ విషయాలు తరువాత తెలియచేస్తా"మని వ్రాసి ఉన్నది.

ఒక రోజున నాన్నగారు ఏదో ఊరు వెళ్లారు. పిన్ని ఎవరినో చూడ్డానికి వెళ్ళింది. ఇల్లంతా బావురుమంటూ ఉన్నది. నేను గదిలో కూర్చుని ఆలోచిస్తున్నాను. ఇంతలో "అమ్మా! సరోజినమ్మగారు!" అన్న పిలుపు వినబడింది. ఎవరా అని చూస్తే వెంకన్న. నన్ను కన్నతండ్రి కంటే ఆప్తుడుగా కంటికి రెప్పవలె కాపాడే పెంపుడు తండ్రి వెంకన్న. అతన్ని చూడగానే నాకండ్లవెంట నీటి చుక్కలు టపటప రాలినయ్.

"పిచ్చితల్లీ! ఏడుస్తున్నావా! కష్టకాలంలో ధైర్యంగా ఉండాలమ్మా. మీ విషయంలో చాలా అన్యాయం చేస్తున్నారమ్మా బాబుగారు. ఆమహాతల్లి సుశీలమ్మగారే బ్రతికుంటే మీరెంతసుఖంగా ఉండేవారమ్మా. మీకేదైనా సహాయం కావాలంటే చెప్పండమ్మా నేను చేస్తాను" అని అన్నాడు.

ఆమాటలు వినగానే "నిజంగా భగవంతుడు నన్ను రక్షించడానికి వెంకన్న మనస్సులో ప్రవేశించాడా!" అన్నట్లనిపించింది. వెంటనే నాకూ రామారావుగారికీ జరిగిన ఉత్తరాల సంగతి చెప్పి సహాయం చెయ్యమన్నాను.

"తల్లీ నేనిప్పుడే వెళ్ళి మాట్లాడి ఆలోచించి మీకు తప్పక సహాయం చేస్తా"నని చెప్పి వెళ్లిపోయాడు.

"మానవుల్లో మంచివారుకూడా ఉన్నారు. మంచివారే లేకపోతే నావంటి నిర్భాగ్యులెంతమంది మూర్ఖులైన తల్లి దండ్రులకు ఆహుతయిపోయేవారో కదా!" అని అనుకున్నాను.

పెండ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. నెలరోజులుంది లగ్నానికి. ఆ రోజు శుక్రవారం తలంటి పోసుకుని తలార్చుకుంటున్నాను. వెంకయ్య చాటుగా : నాగదిలోకొచ్చి "రామారావుగా రిమ్మన్నారమ్మా ఈ కవ"రని యిచ్చి వెళ్లిపోయాడు. అందులో "వెంకయ్యతో కలసి ఆలోచించినట్లు. నేను వెంకయ్య యింటికి వస్తే అక్కడ రామారావుగారు కలుసుకుని నన్ను తీసుకుని వెళ్ళేట్లు" ఉంది. బాగుంది, ఇంతకంటే నాకేమి కావాలి! ఆ పెండ్లి చేసుకునేదానికన్నా రామారావుగారి మాటప్రకారం నడచుకోవడం నాకు సబబుగా కనపడింది.

వెంకన్నతో వెళ్ళిపోవాలనే తోచింది. లోకం ఏమంటుందో అన్న ఆలోచన తట్టకపోలేదు అయినా దానికి ప్రాధాన్యం యివ్వలేదు. అప్పుడు తెలియలేదమ్మా ఈ ప్రపంచం నన్ను చూచి పరిహసిస్తుందని! ఆ యమయాతన నుండి బయటకి రావాలనే కోరికే నా చేత ఆ పని చేయించింది.

నేను వెంకన్నా మాట్లాడుకున్నాము 'ఆరాత్రి 12 గం॥ లకు వెంకన్నతో వాళ్ల యింటికి పోయేటట్లు. అటునుండి అటే నాకోసం తపించే మాధవరావుగారితో వెళ్లేటట్లు' నిశ్చయించుకున్నాను. ఆ సంగతి వెంకన్న ద్వారా రామారావుగారికి కబురంపాను. ఇంట్లో వాళ్ళకు అనుమానం కలుగకుండా ప్రవర్తించాను. మా పిన్నితో నాన్నతో కలసి నవ్వుతూ పేలుతూ ఇంట్లో పని అందుకుంటూ ఉన్నాను. ఇదంతా చూచి పిన్ని చాలా సంతోషపడి "చూడండి మొట్టమొదట మొండికి తిరిగినా అమ్మాయి పరిస్థితులు అర్థం చేసుకుని దారికొచ్చింది! పిచ్చి పిల్ల దానికి మట్టుకు తెలియదూ! అమ్మ, నాన్న తన శ్రేయస్సు కొరకే చేస్తారని!" అని చేతులు త్రిప్పుతూ నాన్నగారికి చెప్పింది.

ఎప్పుడు 12 అవుతుందా? ఎప్పుడు ఆయింట్లోనుండి బయట పడదామా అన్న ఆలోచనతో గడియారం వంక చూస్తున్నాను! అనుకున్న సమయం రెక్కలు కట్టుకుని దగ్గరపడ్డది. ఇల్లంతా నిద్రలో మునిగింది. అన్నీ సక్రమంగానే ఉన్నాయ్.

ఇంతలో వెంకన్న బైట గేటు తీసుకుని ప్రవేశించాడు. "అన్నీ సరిగ్గా ఉన్నవా?" సైగలతో అడిగాను. "అన్నీ బాగా ఉన్న"వని చెప్పాడు. అంతే తల్లీ! ఆ ఇంట్లో నుండి బైట పడ్డాను. ఆనరకకూపంనుండి తప్పించుకుని వెంకన్నా వాళ్ళ యింటికి వచ్చాను. అక్కడ నుంచి రామారావుగారు, మాధవరావుగారితో కలసి ఆ రాత్రికి రాత్రి రామారావుగారి ఊరికి వెళ్ళాము. పాపం వెంకన్న నేను వెళ్ళేటప్పుడు చాలా బాధపడ్డాడు. మాతో రమ్మంటే రానన్నాడు. బీదవాడైనప్పటికీ నాకెంతో సహాయం చేశాడు.

రామారావుగారి ఊర్లోనే మా వివాహం. అక్కణ్నుంచి మీ నాన్నగారి ఊరికి వచ్చేశాము. అది ఒక పల్లెటూరు. అంతవరకు పట్టణవాసంలో పెరిగిన నాకు ఆ వాతావరణం చాలా క్రొత్తగా ఉండేది.

మీ నాన్నగారికి తల్లి లేదు. తండ్రి చాలా వయస్సు ముదిరినవాడు. మా అత్తగారు మీ నాన్నగారికి 14 సంవత్సరాలప్పుడు చనిపోయినదట. ఆమె మీద ఉన్న మమకారం చేత మామగారు తిరిగి వివాహం చేసుకోలేదు.

తరువాత, మీ నాన్నగారు బి. ఎ. పూర్తి చేశారు. ఉద్యోగం కోసం ప్రయత్నం చేశారు. ఎక్కడా దొరకలేదు కొడుకుకు ఉద్యోగం లేదన్న దిగులుతో తండ్రిమంచం పట్టారు.

ఇక మీ నాన్న బి. ఎ. పట్టా చేత పట్టుకుని తిరగని ఊళ్ళు లేవు, ఎక్కనిగుమ్మాలు లేవు. ఉన్న ఆస్థి కాస్తా ఉద్యోగాలకయిపోయింది. ఈ దిగులుతో మామయ్యగారు చనిపోయారు. ఆయన చనిపోయిన యేణ్ణర్ధానికి నీవు పుట్టావు. ఆస్తింతా పోయిన తరువాత ఇంకా ఆ పల్లెటూ రెందుకని బయలుదేరి ఈ ఊరొచ్చాము. ఇక్కడ రామారావుగారి ప్రాపకం వల్ల మీ నాన్నగారికి చిన్న ఉద్యోగం దొరికింది. నెలకు 60 రూపాయల జీతం. అప్పణ్నుంచి ఇప్పటివరకు నా తల్లిదండ్రుల సంగతి తెలియదు. ఈ ఉద్యోగాలకు తిరగడం వల్లనే మీ నాన్నగారి ఆరోగ్యం చెడిపోయింది. నిన్ను డాక్టరు చదువు చదివించాలని మీ నాన్నగారి కోరికమ్మా! ఇప్పుడే జీతం కట్టలేకపోతే పెద్ద చదువులకు ఏం కడతారో? ఇదీ నా దుఃఖ భాజనమైన గాథ!" "అని చెప్తూ కండ్ల వెంట నీరు పెట్టుకున్న తల్లిని చూచి, నా గుండె తరుక్కుపోయింది. నేను మాట్లాడలేకపోయాను. ఇంతలో నాన్నగారు వచ్చి "అమ్మాయీ శశీ" అనే వరకూ నాకు స్పృహరాలేదు.

3

కాలం గబ గబా గడచిపోయింది తమ్ముడూ! ఒక రోజున నేను స్కూలునుండి వచ్చేసరికి ఇంట్లోనుండి డాక్టరుగారు బయటకు వచ్చి రామారావుగారితో మాట్లాతున్నారు. డాక్టరుగారేదో "చాలా 'సీరియస్' కేసండీ లాభం లేదు." అనే మాటలు విన్నాను. నేను భయపడ్డాను. ఇవి మా నాన్నగార్ని గురించేనా!

రెండు రోజులనుండి నాన్నకు చాలా తీవ్రంగా ఉన్నదా జబ్బు. దాని పేరు 'క్షయ' మనస్సంతా వ్యథలకు క్రుంగి, తల ఆలోచనలకు వేడెక్కిపోయి ఈ జబ్బుకు గురి అయ్యారు నాన్న! రామారావుగారు నన్ను చూచి కండ్ల నీళ్ళు తుడుచుకుంటూ "స్కూలు వదిలారా శశీ!" అంటూ పలకరించారు లేని నవ్వుతో.

"అదేమిటి పెదనాన్నా అట్లా ఉన్నారని?" ప్రశ్నించాను. "ఏమీ లేదమ్మా"! అంటూ లోపలకు నడచారు. నేనూ వారినే అనుసరించాను. లోపల నాన్నగారు మంచంమీద ఆయాసం, దగ్గుతో బాధపడుతున్నారు. అమ్మ ప్రక్కన నిలపడి తనలోతాను కుమిలిపోతున్నది. అక్కడి పరిస్థితుల్ని చూచి నాకు భయంవేసి బావురుమన్నాను.

ఆ రాత్రి సరిగ్గా 12 గం॥లు కొట్టింది. అందరం నాన్న మంచం చుట్టూ ఉన్నాము. డాక్టరుగారు కూడా ఉన్నారు. నాన్నగారు మగతగా నిద్రపోతున్నారు. ఆ పరిస్థితుల్లో అమ్మను ఒంటరిగా వదలక కనిపెట్టి చూస్తు

ఆత్మకథ

న్నారు ఏ అఘాయిత్యమైనా చేస్తుందేమో అన్న భయంతో. స్త్రీ ఎవరికోసం తనసంపదలు, తన వాళ్ళను వదలిపెట్టి వచ్చిందో వాళ్ళే లేకపోతే ఇంక ఆమె ఏమి చెయ్యాలన్నా చేస్తుంది!

నాన్నగారు మాగన్ను నిద్రనుండి కళ్ళు తెరచి తన బాల్య స్నేహితుడు, తనకోసం ప్రాణాలర్పించడానికి సిద్దంగా ఉన్న ప్రాణస్నేహిడైన రామారావుగారిని దగ్గరకు రమ్మనట్లుగా చూచారు. ఆ చూపు గ్రహించి రామారావు గారు నాన్న ప్రక్కన కూర్చున్నారు. మాట్లాడలేక నా చేతినీ, నీ చేతినీ అతని చేతిలో పెట్టి అమ్మను చూపిస్తూ కన్ను మూసారు. ఆ మూయడం మళ్ళీ తెరవలేదు. అమ్మ నాన్నగారి వియోగం భరించలేక నాన్నను చూడ్డానికి అదే త్రోవన పోయింది. నిన్నూ నన్నూ లెక్క చేయకుండా వదలి వెళ్ళిపోయింది. ఇంక మనల్ని పోషించే భారం ఆయన పైన పడ్డది.

రామారావుగారి కొక్క కూతురు. చాలా మంచిపిల్ల పేరు లక్ష్మి. ఇప్పుడు వివాహం కాబోయేది ఆ అమ్మాయికే నేను స్కూలుఫైనలు పాసయిన తరువాత నన్ను 'ఇంటరు'లో ప్రవేశ పెట్టారు. నీవు మూడవ ఫారం చదువుతున్నావు. నిన్ను 'కాన్‌వెంట్'లో చేర్పించారు.

అందుచేత నీకు రామారావుగారంత పరిచయంలేదు. తన బాల్యస్నేహితుని కోరిక గనుక నన్ను రామారావుగారు తన సొంత డబ్బుతో 'ఎమ్. బి., బి. ఎస్.' చదివించారు. నాకు ఇక్కడ ఉద్యోగం అవడానికి కారణం కూడా ఆయనే. ఇది తమ్ముడూ కథ — ఇది నీకథా నాకథా మన ఆత్మకథ!" అంటూ శశి ముగించింది.

సుధాకర్ దిగులు ముఖంతో ఏవేవో ఆలోచిస్తున్నాడు. అతని కనుకొలకుల్లో నిలచిన నీరు తళ తళ లాడుతున్నది.

శశి నాలుక కొరుక్కున్నది. ఇంత కథ చెప్పి వాడి పసిమనస్సు నొప్పించడ మేమిటి? — చప్పున తమ్ముడివీపు నిమురుతూ "మరి మనం పెళ్ళికి పోవద్దూ ఆయన రమ్మని వ్రాశారుగా! ప్రయాణ సన్నాహాలేం చేద్దా మంటావ్" అన్నాను.

సుధాకర్ మాట్లాడలేదు. "ఏరా! పెళ్ళిని గురించి ఆలోచిస్తున్నావా? — పద! రామారావుగారితో చెప్పి నీకు కూడా ఒక పిల్లను ముడిపెట్టిస్తాను!" అన్నది. దాంతో అక్క ముఖం చూచి జీవంలేని చిరునవ్వు నవ్వుతూ అక్కడ నుండి ఇంట్లోకి కదిలాడు సుధాకర్.

★

సమాధానం

(28-వ పేజీ తరువాయి)

తీర్చుకున్నాడు. నేను సృష్టించిన రీటాలు క్షేమంగా ఉన్నాయా? పోనీలే రీటా! నువ్వు నాదగ్గరున్నావు. నాకింక ఏకుంచ, కలం అక్కర్లేదు." అని అనేవాడు.

నన్నత నెంతగానో గౌరవించేవాడు. నే నతనికోసం ఎంతో పాటుపడుతున్నానని అంటాడు. నా హృదయాన్నెరుగున్న మధుకంటె నన్నెవరు ఎక్కువగా ప్రేమిస్తారు. అటువంటి నా మధుకి భార్యగా ఉండటంకంటె నాకేమికావాలి.

అతను సృష్టించిన చిత్రాలన్నీ గోడలమీదనుంచి అతన్ని దీనంగా చూస్తూంటాయి. కుంచెలు తమ సానుభూతిని వెలిబరుస్తూ ఉంటాయి. సితారు పుచ్చుకొని నిర్విచారంగా పాడుకుంటూంటాడు. రీటాలన్నీ కళ్ళు కదపకుండా వింటూంటాయి. స్వర్గంలోకూడా అతని రీటా వింటూ ఉంటుందనుకుంటాను.

కళ్ళు పోయినంత మాత్రంలో మానవులు గ్రుడ్డివాళ్లు కారు. ఉత్తరాన్ని ఒక కథలా చదివి చించెయ్యి.

నీకు ఎప్పుడూ ప్రశాంత వాతావరణంలోనే సమాధానాలు వ్రాస్తూంటాను. నా భర్త కూడా నాతోనే ఉంటారు. మా నిత్య జీవితంలో ఈ సముద్రతీరం దగ్గర కొన్ని గంటలు వ్యయం చెయ్యడం మాకు అలవాటైపోయింది.

శలపు.